నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

ఉద్దానానికి శుద్ధజలం ఎప్పుడో..?

- రూ.700 కోట్లతో 2020లో పనులు ప్రారంభం
- రెండేళ్లలో పూర్తి చేసేలా ఒప్పందం
- ఇప్పటివరకు 85 శాతమే పూర్తి
- మార్చి వరకు ఒప్పంద కాలపరిమితి పొడిగింపు

ఉద్దానంలో కిడ్నీ వ్యాధులు ప్రబలడానికి తాగునీరు కారణమని భావించిన ప్రభుత్వం 2019లో ఇంటింటికీ రక్షిత మంచినీటిని అందిస్తామని ప్రకటించింది. అందుకనుగుణంగా 2020 ఫిబ్రవరిలో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టు పనులు అదే ఏడాది ఆగస్టు 7వ తేదీన ప్రారంభమయ్యాయి. ఒప్పందం ప్రకారం రెండేళ్లలో పూర్తి కావాల్సి ఉంది. రెండున్నర ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. ఇప్పటివరకు 85 శాతం పనులు జరిగినట్లు అధికారులు చెప్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా ఒప్పంద కాలపరిమితిని పొడిగించారు. పనులు చేపడుతున్న తీరును పరిశీలిస్తే నిర్దిష్ట కాలంలోగా ప్రాజెక్టు పూర్తి కావడంపై సందేహాలు నెలకొన్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉద్దానం ప్రాంతంలో ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం రూ.700 కోట్లతో గతంలోనే సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించింది. ఉద్దానం ప్రాంతంలోని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాలతో పాటు పలాస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీలకూ శుద్ధ జలం అందించాలన్న ప్రతిపాదనలకు గతంలోనే ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. దీంతో ఉద్దానం ప్రాంతంలోని 807 గ్రామాలకు తాగునీరు అందనుంది. ఇప్పటివరకు ఉన్న ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు స్థానంలో ఇది రానుంది. ఇప్పటివరకు ఉన్న ఈ ప్రాజెక్టు ద్వారా రోజుకు ఒక వ్యక్తికి 40 లీటర్ల అందించడానికే అవకాశముంది. ప్రస్తుతం నిర్మాణం చేపడుతున్న ప్రాజెక్టు ద్వారా రోజుకు 105 లీటర్ల నీటిని అందించనున్నట్లు ప్రభుత్వం చెప్తోంది. సకాలంలో పనులు కాకపోవడంతో రక్షిత నీటి కోసం ఉద్దానం ప్రాంత ప్రజలు ఎదురుచూపులు చూడాల్సి వస్తోంది.

ఇంటింటికీ కుళాయి పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

మందకొడిగా ట్యాంకుల నిర్మాణం

ప్రతి వ్యక్తికి రోజుకు 105 లీటర్ల నీటిని అందించాలంటే చాలా గ్రామాల్లో ఉన్న నీటి ట్యాంకుల సామర్థ్యం పెంచాల్సి ఉంది. ప్రస్తుతం ఒక వ్యక్తికి అందించాల్సిన నీటి పరిమాణం మేరకు ఒక గ్రామానికి 20 వేల కిలోలీటర్ల సామర్థ్యం గల ట్యాంకును నిర్మించాల్సి ఉంది. గ్రామంలో 10 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకుకు అదనంగా మరో ట్యాంకు నిర్మాణం జరుగుతోంది. కొత్తగా చేపట్టనున్న ప్రాజెక్టు కింద 363 ట్యాంకులను నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 274 ట్యాంకులను నిర్మించారు.

పైపులైను పనుల పరిస్థితి ఇలా...

ఉద్దానం ప్రాంతంలోని ప్రతి ఇంటికీ వంద లీటర్ల తాగునీటిని అందించే విధంగా ప్రాజెక్టును రూపొందించారు. ప్రాజెక్టుకు 1.12 టిఎంసిల నీరు అవసరం కాగా, వంశధార రిజర్వాయరు వద్ద రోజుకు 84 మిలియన్ లీటర్లను శుద్ధి చేసే ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం సాగుతోంది. ప్రాజెక్టు ప్రాంతాన్ని పది భాగాలుగా విభజించి నిర్మాణాలు చేపడుతున్నారు. 90 కిలో లీటర్ల నుంచి రెండు వేల కిలో లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం సాగుతోంది. అదే సామర్థ్యంతో మరో ఐదు చోట్ల గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టనున్నారు. 600 కిలో లీటర్ల నుంచి 7,500 కిలో లీటర్ల సామర్థ్యం గల స్లంప్ వెల్స్ పనులు 51 చోట్ల నిర్మాణంలో ఉన్నాయి. పది కిలో లీటర్ల నుంచి 250 కిలో లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ సోర్స్ రిజర్వాయర్ల పనులూ 585 చోట్ల అదనంగా కొనసాగుతున్నాయి. వీటితోపాటు బోర్‌వెల్స్ మంచినీటి వనరులుగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఎత్తయిన కొండ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలకు సింగిల్ విలేజ్ స్కీమ్‌ల నిర్మాణంలో కొంత జాప్యమవుతోంది. 1048 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 776 కిలోమీటర్ల వరకు వేశారు.

జాప్యానికి ఇవే కారణాలు

ఉద్దానం ప్రాజెక్టు పనులపై కోవిడ్ సెకండ్ వేవ్ తీవ్ర ప్రభావం చూపినట్లు అధికారులు చెప్తున్నారు. కోవిడ్ వ్యాప్తి తీవ్రంగా ఉండడంతో పనులు చేసేందుకు కూలీలు రాకపోవడంతో ప్రాజెక్టు జాప్యానికి దారి తీశాయని అంటున్నారు. అధికారులు కూలీలపై నెపం నెట్టేసినా పనులు సకాలంలో పూర్తి కాకపోవడానికి కాంట్రాక్టర్ తప్పిదం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు పనులు చేపడుతున్న మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమూ మరో కారణంగా ఉంది. నిర్మాణ సంస్థ ఇప్పటివరకు 85 శాతం పనులు పూర్తి చేసినట్లు అధికారులు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.387.89 కోట్లు ఖర్చు చేసినట్లు పొందుపరిచారు. పనులు జరిగిన మేరకు రూ.550 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో ఉద్దాన ప్రాంత ప్రజలకు శుద్ధ జలానికి ఎదురుచూపులే మిగులుతున్నాయి.

14,460 మందికి 'చేదోడు'

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో 14,460 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.14.46 కోట్లను జమ చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జగనన్న చేదోడు మూడో విడత నిధులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 6,280 మంది రజక, 3042 మంది నాయీబ్రాహ్మణులు, 5138 మంది దర్జీ లబ్ధిదారులను అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. రూ.పది వేలు చొప్పున వీరి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 2070 మంది, ఎచ్చెర్ల నియోజకవర్గంలో 2261 మంది, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 1515 మంది, నరసన్నపేట నియోజకవర్గంలో 2097 మంది లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. పలాస నియోజకవర్గంలో 1182 మంది, పాతపట్నం నియోజకవర్గంలో 1623 మంది, శ్రీకాకుళం నియోజకవర్గంలో 2,292 మంది, టెక్కలి నియోజకవర్గంలో 1634 మంది లబ్ధిదారులు ఉన్నట్లు వివరించారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ మూడో విడత జగనన్న చేదోడు వల్ల రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. నవరత్నాల పథకాల ద్వారా చేపడుతున్న సంక్షేమ పథకాల వల్ల పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. అనంతరం నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్ అంధవరపు సూరిబాబు, చైర్‌పర్సన్లు బి.హేమామాలిని రెడ్డి, రాజాపు హైమావతి, చీపురు రాణి, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గడ్డెమ్మ, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి వాసుదేవరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భూముల క్రయ విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఇకపై గ్రామ, వార్డు సచివాలయాల్లో చేసుకోవచ్చని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పోస్టర్‌ను జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలు వ్యయ ప్రయాసలతో జిల్లా కేంద్రానికి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తిరగకుండా గ్రామాల్లోనే రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు విద్యాసాగర్, చిట్టిరాజు, జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఎస్‌పి స్పందనకు 34 అర్జీలు

(6లో)

అంతర్జాతీయ వాణిజ్యంపై అవగాహన అవసరం

బిఆర్‌ఎయు పూర్వ విసి లజపతిరాయ్

కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష ఉండరాదని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్పర్శ లెప్రసీ అవగాహనా కార్యక్రమంలో భాగంగా నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో అధికారులతో సోమవారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి నుంచి జిల్లాను విముక్తి చేయడానికి ఉన్న ఏ అవకాశాన్నీ వదులుకోబోమన్నారు. ఈ వ్యాధిని సులభంగా గుర్తించవచ్చని, చికిత్స ద్వారా నయం చేయవచ్చని చెప్పారు. కుష్టు వ్యాధి కేసులను ప్రారంభ దశలోనే గుర్తించి పూర్తిగా నయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి అనురాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద చేపట్టిన స్పర్శ అవగాహన కార్యక్రమాన్ని అదనపు డిఎంహెచ్ఒ అనురాధ ప్రారంభించారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

స్ఫూర్తిప్రదాత గాంధీ

బిఆర్‌ఎయు విసి వెంకటరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతిపిత మహాత్మాగాంధీ అనుసరించిన విధానాలు ప్రపంచానికే స్ఫూర్తినీయమని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. గాంధీ మందిరం భారత స్వాతంత్ర్య స్మృతి వనం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గాంధీ స్మారక నిధి, గాంధీ మార్గ్ ఇండియా ఫౌండేషన్, మందిర కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యాన నగరంలోని శాంతినగర్ కాలనీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అనేక దేశాలకు చెందిన పోరాట యోధులు మహాత్మాగాంధీ అనుసరించిన విధానాలకు ఆకర్షితులయ్యారన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ప్రధానమైన పాత్ర పోషించిన గాంధీకి జిల్లాలో మందిరం ఉండటం ఆనందదాయకమని అన్నారు. అంబేద్కర్ వర్సిటీలోనూ గాంధీ ఆలోచనా విధానాలపై పీజీ డిప్లమో ఉందన్నారు. నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ భారతదేశంలో మహాత్మాగాంధీకి మందిరం ఉన్న ప్రదేశం శ్రీకాకుళం కావడం గొప్ప విశేషమని అన్నారు. మందిర నిర్మాణం, అభివృద్ధిలో నగర కార్పొరేషకు భాగస్వామ్యం కల్పించడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో గాంధీమార్గ్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి సురంగి మోహనరావు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, బిఆర్‌ఎయు పాలకవర్గ సభ్యులు బరాటం లక్ష్మణరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు, మందిర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, కమిటీ ప్రతినిధు లు నటుకుల మోహన్, డాక్టర్ బాడాన దేవభూషణరావు, హారికాప్రసాద్, నూక సన్యాసిరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విసి వెంకటరావు

నిర్వాసితులను దోచుకున్నారు

- టిడిపి నాయకులపై ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజం
- వైసిపి ప్రభుత్వం వచ్చాక రూ.216 కోట్ల అదనపు పరిహారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి ప్రభుత్వ హయాంలో వంశధార నిర్వాసితులకు రూ.400 కోట్లు ఇచ్చామని చెప్తున్న టిడిపి నాయకులు, కమీషన్ పద్ధతిలో నిర్వాసితులను దోచుకున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వాసితులకు రూ.216 కోట్ల అదనపు పరిహారం అందించి అర్హులందరికీ న్యాయం చేసిందని చెప్పారు. హిరమండలం రిజర్వాయర్ నుంచి ఉద్దానం తాగునీటి ప్రాజెక్టుకు మంచినీటిని అందించేందుకు రూ.700 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఈ పథకానికి అనుసంధానం చేస్తూ పాతపట్నం నియోజకవర్గంలోని మూడు మండలాలకు తాగునీటిని అందించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కోరామన్నారు. దీనికి అంగీకరించిన ఆయన మెళియాపుట్టి, హిరమండలం, పాతపట్నం మండలాలకు రూ.264 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. వర్షాకాలంలో రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేసుకునే విధంగా రూ.200 కోట్లతో ఎత్తిపోతల పథకం మంజూరు చేశారని, ఈ పథకం పూర్తయితే 2.30 లక్షల ఎకరాలకు సాగునీరు స్థిరీకరించడానికి వీలవుతుందన్నారు. గోపాలపురం వద్ద మురుగునీరు కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నామని, ఈ సమస్య పరిష్కారానికి ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక మహిళలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధితో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఆక్రమణ భూములకు పట్టాలు ఇవ్వవద్దు

- కలెక్టర్‌కు కృష్ణాపురం గ్రామస్తుల ఫిర్యాదు
- 'స్పందన'కు 220 వినతులు

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రణస్థలం మండలం కృష్ణాపురంలో రహదారికి ఆనుకుని ఉన్న 5.50 ఎకరాల ప్రభుత్వ భూమిని గొర్లెపేటకు చెందిన కొందరు ఆక్రమించుకుని పట్టాల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేశారని, అత్యంత విలువైన ఆ భూములను ప్రభుత్వ అవసరాలకు మాత్రమే వినియోగించాలని ఆ గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 220 వినతులు వచ్చాయి. వినతులను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్వీకరించారు. తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిని శ్రీకాకుళం తహశీల్దార్, పెద్దపాడు విఆర్‌ఒ ఉద్దేశపూర్వకంగా అంగన్వాడీ భవనానికి కేటాయించారని, తన భూమిని తనకు ఇప్పించాలని పెద్దపాడుకు చెందిన మంగళంపల్లి కృష్ణాజీ వినతిపత్రం ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సిహెచ్.నరేష్, కె.ఈశ్వరరావు తదితరులు కోరారు. వీటితో పాటు పలు సామాజిక, వ్యక్తిగత సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి.

పెండింగ్ వినతులకు సత్వర పరిష్కారం

స్పందన, ఎపి ఆన్‌లైన్, ముఖ్యమంత్రి పోర్టల్‌లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి వాటికి పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెబ్‌సైట్‌లో పెండింగ్ ఉండడం వల్ల అవే సమస్యలతో పదేపదే ప్రజలు స్పందనకు వస్తున్నారని, ఇటువంటి వాటిని తిరిగి పరిశీలన చేయాల్సి వస్తోందన్నారు. శాఖాపరమైన పరిష్కారం చూపడం గానీ, వాస్తవిక పరిస్థితిని లబ్ధిదారునికి వివరించి క్లోజ్ చేయడం గానీ చేయాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, రవాణా, గిరిజన సంక్షేమం, డ్వామా, విద్యా శాఖ, అటవీ శాఖ, బిసి సంక్షేమం, ఎస్‌ఇబి తదితర శాఖలు ఫేస్ రికగ్నిజేషన్ వేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తొలుత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా అధికారులు మౌనం పాటించి గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఉప కలెక్టర్ జి.జయదేవి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు విద్యాసాగర్, జి.వి చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

బలసలరేవు వంతెనకు
అనుమతులు మంజూరు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని ఇసుకలపేట నాగావళి నది అవతల ఒడ్డున ఉన్న సంతకవిటి మండలం వాల్తేరు మధ్య బలసలరేవు వంతెన నిర్మాణానికి ప్రభుత్వం అన్ని అనుమతులను మంజూరు చేసిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ప్రతిపాదిత వంతెన నిర్మాణం ప్రాంతాన్ని అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.87 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. 480 మీటర్ల పొడవుతో, 12.5 మీటర్ల వెడల్పుతో రూ.40.22 కోట్ల అంచనాతో వంతెన నిర్మాణం కానుందన్నారు. వాల్తేరు వద్ద 770 మీటర్లు, ఇసుకలపేట వద్ద 920 మీటర్ల వంతెనకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 13.191 ఎకరాల భూసేకరణ అవసరమని చెప్పారు. అత్యాధునిక పరికరాలతో వంతెన నిర్మాణం పూర్తి కానుందని తెలిపారు. ఈ వంతెన నిర్మాణానికి ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ఈ వంతెన నిర్మాణం వల్ల వందలాది గ్రామాల మధ్య రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. రైతుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం లభిస్తుందని తెలిపారు. రోడ్డు పక్కన వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణం వల్ల ఇచ్ఛాపురం నుంచి రాజాం వరకు సుమారు 80 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. ఆమదాలవలస, శ్రీకాకుళం, పొందూరు, పాలకొండ, జి.సిగడాం, సంతకవిటి మండలాల ప్రజలు దీని ద్వారా అధిక ప్రయోజనం పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినేని వాణి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ కాంతిమతి, ఇఇ రవినాయక్, డిఇ జూన్ విక్లీఫ్, జెఇ ఆంజనేయ నాయక్, నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

బలసలరేవు వంతెన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఎస్‌పి స్పందనకు 34 అర్జీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

'స్పందన' కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల ప్రాధాన్యతనిచ్చి నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందనలో ఎస్‌పితో పాటు మహిళా పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి డి.వాసుదేవ్ 34 ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ తగాదాలకు సంబంధించినవి మూడు, సివిల్ పది, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు 11, పాత ఫిర్యాదులు ఏడు, ఛీటింగ్ అంశాలు మూడు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదుదారుల వివరాలు, వారి సమస్యలను తెలియజేశారు. తీసుకున్న చర్యలపై తనకు ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని ఆదేశించారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గౌతు శిరీష

ఆదర్శప్రాయుడు అంబేద్కర్

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాస: ఆదర్శప్రాయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. అంటరానితనం, కుల నిర్మూలనకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. మండలంలోని పెద్ద నారాయణపురం దళిత వీధిలో బిఎస్‌ఎఫ్ ఉద్యోగి నిమ్మాన గోపాల్ తన సొంత నిధులతో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని శిరీష సోమవారం ఆవిష్కరించారు. పూల మాలలతో ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మత, జాతి, వర్గ భేదం లేకుండా రాజ్యాంగం నిర్మించిన వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం నేడు రాష్ట్రంలో లేదని, తన స్వార్థ ప్రయోజనాల కోసం అధికార పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ హక్కుల సాధనకు పోరాడాలని, హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ విగ్రహాన్ని తన సొంత నిధులతో నిర్మించిన గోపాల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, పివితల్‌రావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పాల పోలారావు, యడ్ల గోపి, సహాయ కార్యదర్శి వడ్డీ యాదగిరి, టి.పాపారావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, టిడిపి మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్, జయచంద్ర పాత్రో, హృషికేశరావు, వంకల కూర్మారావు, సింహాచలం, రాజు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులు దోచుకుంటున్నారు

- ఆగ్రహం వ్యక్తం చేసిన కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి
- అజెండాలోని మూడు అంశాలు వాయిదా
- కెటి రోడ్డు పనులపై అధికార పార్టీ కౌన్సిలర్ అసహనం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రజల నుంచి ఇష్టానుసారంగా డబ్బులను దోచుకుంటున్నారని, అందుకు సాక్ష్యాధారాలతో రుజువు చేస్తానని కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. బమ్మిడి సంతోష్ కుమార్ మాట్లాడుతూ వ్యాపార షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ముందుగా మున్సిపల్ అనుమతితో పాటు ఆ స్థలాన్ని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చేయకపోయినా అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వాటికి అనుమతి కోసం మున్సిపల్ అజెండాలో ఎలా పెడతారని ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఒకరి వద్ద నుంచి రూ. 25 వేలు వసూలు చేసినట్లు నా వద్ద ఆధారాలు ఉన్నాయని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. వ్యాపార షాపింగ్ కాంప్లెక్స్ అనుమతిపై చైర్మన్‌తో పాటు అధికారులు పర్యవేక్షించాలని కోరగా దీనిపై చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ వ్యాపార షాపింగ్ కాంప్లెక్స్ అనుమతిపై తనతో పాటు అధికారులు పర్యవేక్షించాకే అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. అప్పటివరకు అజెండాలో ఉన్న వ్యాపార షాపింగ్ కాంప్లెక్స్ అనుమతికి సంబంధించిన 12, 20, 21 అంశాలను వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గా శంకర్ పండా మాట్లాడుతూ గత సమావేశాల్లో తీర్మానించిన అభివృద్ధి పనులను రద్దు చేసి కెటి రోడ్డు విస్తరణ పనులకు ఆ నిధులు కేటాయించడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే వేరే కాంట్రాక్టర్లతో పనులు చేయించాలి తప్ప ఆ నిధులను వేరే పనులకు మళ్లించడం సరైందని కాదన్నారు. కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కెటి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కాలువ, కాలువకు కన్వంటింగ్ ఎందుకు కలపడం లేదని అధికారులను నిలదీశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు మాట్లాడుతూ అంబుసోలి, ప్రకాష్ నగర్, శాంతి నగర్ ప్రాంతాల ప్రజలు తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆయా ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. వచ్చే వేసవిలో దీనిపై అధికారులు బాధ్యత వహించి నీరు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 21 అంశాలను గాను మూడు అంశాలను వాయిదా వేసి 18 అంశాలను కౌన్సిల్ లో ఆమోదం చేసినట్లు చైర్మన్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ డిఈఈ బల్ల హరి, మున్సిపల్ ఎఈఈ అవినాష్, హౌసింగ్ ఎఈఈ ధర్మేంద్ర, మున్సిపల్ అధికారులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్ (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

మహిళా కళాశాలలో మరుగుదొడ్లు ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో కొత్తగా నిర్మించిన మహిళా జూనియర్ కళాశాలకు గుజ్జు నారాయణరెడ్డి తన తల్లిదండ్రులు గుజ్జు గంగాధర్‌రెడ్డి, సుందరమ్మ జ్ఞాపకార్థంగా రూ.20 లక్షలు వితరణగా అందించారు. ఆ మొత్తంతో నిర్మించిన మరుగుదొడ్లను ఆయన కుమార్తె గుజ్జు ప్రక్వా సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. మహిళా జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులలేమి ఉంది. విషయం తెలుసుకున్న ఆయన మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకొచ్చారు. అలాగే కళాశాలకు కావాల్సిన ఫ్యాన్లు, లైట్లు, లో లెవల్‌లో ఉన్న కళాశాల స్థలంలో వర్షపునీరు నిల్వ లేకుండా గ్రావెల్‌తో నింపారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా చేసే మంచి పని పది మందికి ఉపయోగపడాలని అన్నారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిని ప్రిన్సిపల్ రజనీకుమారి, అధ్యాపక బృందం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న గుజ్జు ప్రక్వా

అంతర్జాతీయ వాణిజ్యంపై అవగాహన అవసరం

బిఆర్ఎయు పూర్వ విసి లజపతిరాయ్

మాట్లాడుతున్న లజపతిరాయ్

టెక్కలి రూరల్ : ఆదిత్య కళాశాల ఎంబిఎ విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ, వ్యాపార, వాణిజ్య, నిబంధనలు, సరుకుల ఎగుమతి, దిగుమతి వంటి అంశాలపై అవగాహన ఉండాలని అంబేద్కర్ యూనివర్సిటీ పూర్వపు విసి హెచ్.లజపతిరాయ్ అన్నారు. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విద్యార్థులతో 'అంతర్జాతీయ వ్యాపార, వాణిజ్య సంబంధాలు' అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుటిఒ), జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్ అండ్ ట్రేడ్ (జిఎటిటి) వంటి అంశాల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా భారత్-ఉక్రెయిన్, రష్యా-భారత్, అమెరికా-భారత్ వాణిజ్య సంబంధాల గురించి తెలియజేశారు. ఉక్రెన్‌లో భారత్ విద్యార్థులు 80 శాతం మంది ఏటా వైద్య విద్య అభ్యసిస్తున్నారని, భారత్‌కు అవసరమైన వంట నూనెల్లో 60శాతం ఉక్రెన్ నుండి దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. ప్రముఖ మందుల తయారీ కంపెనీ రెడ్డీ ల్యాబ్ అత్యధిక కర్మాగారాలు ఉక్రెన్‌లో ఉన్న అంశాన్ని ప్రస్తావించారు. ఈ యుద్ధం వల్ల రెడ్డీస్ షేర్ల విలువ గణనీయంగా తగ్గిపోయిందన్నారు. పరిపాలనా అంశాలు, ఆర్థిక మాంద్యం, అంతర్జాతీయ ఒప్పందాలు, యుద్ధాలు, వస్తు ఉత్పత్తి వంటి అంశాలు వ్యాపార, వాణిజ్యాలపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు సమస్యల పరిష్కారానికి అవసరమైన నైపుణ్యతలను కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా లజపతిరాయ్‌కు జ్ఞాపిక అందించి, సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ఎంబిఎ హెచ్‌డి డాక్టర్ కె.వేణుగోపాలరావు, డాక్టర్ బి.శివకుమార్, డాక్టర్ చింతామణి ప్రసాద్ పాణిగ్రాహి, విద్యార్థులు పాల్గొన్నారు.

రసవత్తరంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొండవూరులో ఊరమ్మ తల్లి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు సోమవారం రసవత్తరంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 68 జట్లు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ జట్లను ఎ, బి, సి, డి పూల్‌గా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. కిడిసింగి, కోడిరామ్మూర్తి స్టేడియం జట్ల మధ్య హోరా హోరీగా కబడ్డీ పోటీ జరిగింది. సర్పంచ్ కొల్లి భాస్కరరావు, కిడిసింగి సర్పంచ్ నర్తు లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ నర్తు శేషయ్య, మాజీ ఎంపిటిసి అప్పన్న క్రీడాకారులను పరిచయం చేసుకొని వారిని ప్రోత్సహించారు. ఈ పోటీలకు రిఫరీలుగా ఎన్.రమేష్, ఎస్.నీలయ్య, గవరయ్య, పి.శివాజీ, గిరిబాబు, అనంత, హరి, పి.ఈశ్వరరావు, సాగర్, పివి.రమణ, తదితరులు వ్యవహరించారు. ఈ పోటీలకు విచ్చేసిన క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వహక కమిటీ సభ్యులు దట్టి నాగేష్, కె.రాజేష్, సిహెచ్ కేశవరావు, కొల్లి నగేష్ తెలిపారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

అసిరమ్మ (ఫైల్)

లావేరు : మండలంలోని లావేటిపాలెంకు చెందిన గంటలాన అసిరమ్మ (70) చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అసిరమ్మ ఈనెల 10న ఉదయం టీ చేసేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించిన సమయంలో చీరకు నిప్పంటుకోవడంతో కాళ్లు, చేతులు, శరీరం సగానికిపైగా కాలిపోయింది. తీవ్రంగా కాలిపోయిన ఆమెను 108లో చికిత్స నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. 20 రోజుల పాటు మృత్యువుతో పోరాడిన సోమవారం వేకువజామున పరిస్థితి విషమించి మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా పట్టివేత

కొత్తూరు : మండలంలోని అడ్డంగి పంచాయతీ సవర కూర్మారావు ఇంటి వద్ద నాటుసారాను అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే ఎస్ఐ ఎం.గోవింద్ తన సిబ్బందితో సోమవారం దాడి చేసి కూర్మారావు ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఈ దాడిలో 14 లీటర్ల నాటుసారాను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

మెళియాపుట్టి: మండలంలోని టెక్కలి రోడ్డులో మూలపేట వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో సోద గ్రామానికి చెందిన లోకొండ సింహాచలం గాయపడ్డారు. జంతురులోని తన అత్తవారింటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా వాహనం అదుపు తప్పింది. గాయపడిన ఆయనను స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

మాజీ ఎంపిటిసిపై ఫిర్యాదు

వినతి పత్రాన్ని చూపిస్తున్న పద్మ

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర పంచాయతీకి చెందిన దళిత మహిళ బరిట పద్మ తన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారని టిడిపికి చెందిన మాజీ ఎంపిటిసి వల్లభ వసంతరావుపై ఫిర్యాదు చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో అధికారులను కలిసి, వినతిపత్రం అందించారు. సర్వే నెంబరు 252-1లో సుమారు రెండు ఎకరాలను ఆక్రమించుకొని, తప్పుడు పత్రాలు సృష్టించారని అన్నారు. తన భూమి తనకు ఇవ్వమంటే గతంలో తనపై దాడి చేశారని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

అవార్డును అందుకుంటున్న శ్రీనివాసరావు

గ్రంథాలయాధికారికి పురస్కారం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని మురపాక శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ పురస్కారం అందజేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ వేదికగా సోమవారం నిర్వహించిన ఫౌండేషన్ చైర్మన్ ఇదా శామ్యూల్ రెడ్డి ఆధర్యాన మూడో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో శ్రీనివాసరావుకు జ్ఞాపికలను అందజేసే దుశ్శాలువ కప్పి సన్మానించారు. బెంగుళూరు ఎస్‌హెచ్‌కె అకాడమీ చైర్మన్ ఎస్.హెచ్.కులకర్ణి, యువ భారత్ అకాడమీ ఫౌండర్ విహెచ్ఐ ఈ.రామకృష్ణ, మఠం అధ్యాపకులు ప్రొఫెసర్ విశ్వనాథం, సైక్రియాట్రిస్టు రాజేశ్వరరావు చేతుల మీదుగా స్పందన పురస్కారం-2023 అవార్డును అందుకున్నారు.

ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

మాట్లాడుతున్న భైరాగినాయుడు

ప్రజాశక్తి- పోలాకి

గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, సచివాలయం ద్వారా నియమితులైన ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముద్దాడ భైరాగినాయుడు సూచించారు. సోమవారం పోలాకి పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు పిహెచ్‌సి విస్తరణ అధికారి ఎన్.రవికుమార్ గత ఐదు నెలల్లో చేసిన ఖర్చుల జాబితాను చదివి వినిపించారు. పోలాకి సర్పంచ్ మజ్జి రమణమ్మ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలో రెగ్యులర్ ఎఎన్‌ఎం ఉంచడం లేదని, నెల, నెలా ఎందుకు మారుతున్నారని ప్రశ్నించారు. కుక్క కాటుకు వ్యాక్సిన్లు ఆస్పత్రిలో లేక జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. ఆ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం ముద్దాడ భైరాగినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య సేవలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ వైద్యంను సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరరావు, డాక్టర్ శ్రీనాథ్, తులె పైడమ్మ, గ్రామ పెద్దలు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు టిడిపి నేతలు సిద్ధమా?

సవాల్ చేసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టిడిపి నాయకులు అవినీతిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని వైసిపి మండల అధ్యక్షులు బి.హరి అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టెక్కలిలో బహిరంగ చర్చకు ఎక్కడ స్థలం నిర్ణయించినా అక్కడకు మేము రావడానికి సిద్ధంగా ఉన్నామని టిడిపి నాయకులకు సవాల్ విసిరారు. బగాది శేషగిరిరావు, చాపర గణపతిరావు, కాళింగులను విమర్శిస్తూ దువ్వాడ శ్రీనివాస్ అవినీతి చేశారంటూ మాట్లాడటం అర్ధరహతమని అన్నారు. అచ్చెన్నాయుడు ఒకరికి ఆర్టీసీ కాంప్లెక్స్, మరొకరికి చింతామణి కొండ రాశారని, ఆ అవినీతి మీకు కనపడదా అని ప్రశ్నించారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఎంపిపి అట్లా సరోజనమ్మ మాట్లాడుతూ మట్ట పురుషోత్తం లతన్నపేట కొండ దగ్గర ప్రభుత్వ భూమి టిడిపి అధికారంలో ఉన్నప్పుడు రాసుకున్న మాట వాస్తవం కాదా అని నిలదీశారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు రమేష్, మన్నెల కిషోర్, సర్పంచ్ గొండెలి సుజాత, ఉపసర్పంచ్ ప్రతినిధి గండి అప్పలరెడ్డి, తదితరులు ఉన్నారు.

భవిష్యత్ బాలికలదే

కృష్ణకుమారితో రజనీ కుమార్ దొలై, తదితరులు

కవిటి: భవిష్యత్ బాలికలదేనని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ స్క్వాడ్రన్ లీడర్ ముద్దాడ కృష్ణకుమారి అన్నారు. ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రజనీ కుమార్ దొలై ఆహ్వానం మేరకు బల్లిపుట్టుగ ఎంపియుపి పాఠశాలను సోమవారం సాయంత్రం సందర్శించిన కష్ణకుమారి విద్యార్థుల తల్లదండ్రులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు అండగా నిలబడితే అద్భుతాలు సృష్టిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బాలికల విద్యపై తల్లిదండ్రులే మొదట దృష్టి సారించాలని అన్నారు. నా తల్లిదండ్రులు ఉన్నతంగా ఆలోచించడం వల్లే తాను ప్రస్తుతం ఐపిఎస్ కేడర్‌తో సమాన హోదాలో ఉన్నట్టు తెలిపారు. ఇటీవల కాలంలో బాలికలు అన్ని రంగాల్లో అభివద్ధి చెందుతున్నా ఇంకా మన జిల్లాలో పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందించాల్సి ఉందన్నారు. నా స్వగ్రామం హిరమండలం అని చెప్పారు. అనంతరం సర్పంచ్ శ్రీకన్య దొలై, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తుల సమక్షంలో ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రజనీ కుమార్ దొలై కృష్ణకుమారిని ఘనంగా సన్మానించారు.

హరిశ్చంద్రపురంలో సాగులో ఉన్న చోడి పంట

రైతులకు సిరులు కురిపిస్తున్న చోడి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పొగమంచు కారణంగా పెసర, మినప పంటలు దెబ్బతిన్నాయి. చోడి సాగుచేసిన రైతులకు మాత్రం సిరులు కురిపిస్తోంది. పంటకు తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమ, తక్కువ సమయంలో అధిక దిగుబడి రావడం, రైతులకు మార్కెట్ ఉండటంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. ప్రజలు చోడిని (రాగి)ని ఎక్కువగా వాడడంతో రైతులు మండలంలో సోడి పంటను విస్తారంగా సాగుచేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సోడి పంటకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. సోడి పంటతో వచ్చిన పిండి వల్ల సుగరు, బిపి, తదితర వ్యాధులకు ఒక మందులా పనిచేయటంతో ఈ పంటకు డిమాండ్ పెరిగింది. కుంచం రూ.వంద, కిలో రూ.30 చొప్పున మార్కెట్లో అమ్ముడవుతున్న ఈ పంటను పొలంలోనే దళారులు, వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మండలంలో హరిశ్చంద్రపురం, తర్లిపేట, రేగులపాడు, చీపుర్లపాడు, కోటబొమ్మాళి, చిన్నసాన, నీలంపేట, పట్టుపురం, తాటిపర్తి, దంత, కురుడు, అక్కయ్యవలస, కస్తూరిపాడు, జర్జంగి, సౌడాం, కిష్టుపురం, లఖందిడ్డి, యలమంచిలి, గంగరాం, పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి, నారాయణవలస, నిమ్మాడ తదితర పంచాయతీల పరిధిలో సుమారు 500 ఎకరాల్లో ఈ యేడాది చోడి పంట సాగు చేస్తున్నారు. వ్యవసాయశాఖ అదికారులు ఈ సాగుపై రైతులకు మరింత అవగాహన కల్పించి సబ్సిడీతో ప్రోత్సహిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని రైతులు కోరుతున్నారు.

ఆలిండియా మహాసభకు మహిళా ఉద్యోగుల హాజరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంటర్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జైపూర్లోని దుర్గాపూర్లో శనివారం నుంచి రెండు రోజుల పాటు నేషనల్ ఉమెన్ కన్వెన్షన్ నిర్వహించారు. ఈ సదస్సుకు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా మహిళా విభాగం నుంచి కె.రోజాకుమారి, మమతా బెహరా, పి.శ్రావణి, జి.హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మహిళా ఉద్యోగుల సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ఎదురవుతున్న ఇబ్బందులను సభ దృష్టికి తీసుకొచ్చారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం తరపున రావాల్సిన రాయితీలు, కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు సరైన సౌకర్యాలు లేకపోవడం, మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివక్షపై ప్రస్తావించారు. ఉద్యోగుల ప్రయోజనాల కోసం భవిష్యత్‌లో ఎటువంటి పోరాటాలకైనా మహిళా ఉద్యోగులు ఐక్యం కావాల్సి ఉందని పిలుపునిచ్చారు. జిల్లా నుంచి జాతీయస్థాయి సదస్సుకు నలుగురు నేతలు పాల్గొని తమ గళాన్ని

పాల్గొన్న మహిళా ఉద్యోగులు

వినిపించడంపై ఎపి ఎన్‌జిఒ అసోసియేసన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు రాయి వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

రక్త గ్రూపును తెలుసుకోవాలి

లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు హారికాప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతిఒక్కరూ తమ రక్త గ్రూపును తప్పనిసరిగా తెలుసుకోవాలని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షులు హారికాప్రసాద్ అన్నారు. నగరంలోని అరసవల్లిలో జెసిఐ అధ్యక్షులు మండల హరికృష్ణప్రసాద్ ఆధ్వర్యాన ఉచిత రక్త గ్రూపు పరీక్ష శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 400 మందికి రక్త గ్రూపు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న హారికాప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ తమ బ్లడ్ గ్రూపు తెలియాలన్నారు. ఆపద సమయంలో వారికి సకాలంలో అదే గ్రూప్ రక్తాన్ని అందించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. పరీక్షల కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదని, సకాలంలో రక్తం లభిస్తుందని అన్నారు. తద్వారా సకాలంలో వైద్యం అందించేందుకు వీలువుతుందని పేర్కొన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని సైతం రక్షించుకునేందుకు వీలుందన్నారు. కార్యక్రమంలో జోన్ కో-ఆర్డినేటర్ దూసి సంతోష్, ఉపాధ్యక్షులు తారక రామారావు, లయన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ సురేష్, జెసిఐ డైరెక్టర్ ఎల్.వి.రమణ పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సభ్యులు

రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సోంపేట

పట్టణంలోని బిల్డింగ్ సొసైటీ కాలనీ నుంచి ఎంపిడిఒ కార్యాలయానికి వెళ్లే రహదారి ఆక్రమణలకు గురైందని, పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలనీ టిడిపి నాయకులు ఇఒకు ఫిర్యాదు చేశారు. బిల్డింగ్ సొసైటీ నుంచి ఎంపిడిఒ కార్యాలయానికి వెళ్లే గ్రావెల్ రహదారి వద్ద ఒక వ్యక్తి సిమెంట్ స్తంభాలు పాతి ఆక్రమణకు పాల్పడినట్లు తెలిపారు. దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.



ఇఒకు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బిజెపి విధానాలను తిప్పికొట్టాలి

శ్రీకాకుళం అర్బన్: దేశ సమగ్రతను, సమైక్యతను దెబ్బతీస్తూ దేశ రాజకీయాల్లో ఆర్ఎస్ఎస్ విధానాలను ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి పిలుపునిచ్చారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో రాహుల్‌గాంధీ జోడో ముగింపు ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె జాతీయ పతాకాన్ని, కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. అనంతరం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అధికారం కోసం తరగతులు, ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ... రాజకీయ కుతంత్రాలు చేస్తోందని అన్నారు. జోడో యాత్ర స్ఫూర్తితో దేశ సమగ్రతను సమైక్యతను దేశ ప్రజలు కాపాడుకోవాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు సనపల అన్నాజీరావు, దేశ్శెల్ల గోవింద మల్లిబాబు, పైడి నాగభూషణరావు, లఖినేన నారాయణరావు, కొత్తకోట సింహాద్రి నాయుడు, బస్వా షణ్ముఖరావు పాల్గొన్నారు.

పలువురికి శ్రీకాంత్ పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని బందపల్లి, గేదెల పోలూరు, మర్రిపాడు సి, సవర బాణాపురం గ్రామాల్లో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ సోమవారం పర్యటించారు. బందపల్లికి చెందిన కోల రవణమ్మ ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. గేదెల పోలూరులో ఇటీవల దొంగల దాడిలో గాయపడిన సేనాపతి దుర్యోధనను పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. మర్రిపాడు సికు చెందిన మాజీ విఎఒ నక్క లక్ష్మీనారాయణ మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని, సిరిపురం గుణావతి మృతి చెందింది, ఆమె కుటుంబాన్ని శ్రీకాంత్ పరామర్శించారు. పదనాపురం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన సవర ఉమాశ్రీని పరామర్శించారు. వారి కష్ట, సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బాణాపురం సర్పంచ్ పెద్దింటి చంద్రావు, ఇళయ పురం సర్పంచ్ ఎస్.గౌరీస్, కేరాసింగి సర్పంచ్ ఎస్.అప్పారావు, పెద్ద పద్మాపురం ఎంపీటీసీ ప్రతినిధి ఉర్లన రుషి, యుగంధర్, ఓం శంకర్, మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

గాయాల పాలైన చిన్నారిని పరామర్శిస్తున్న శ్రీకాంత్

పిచ్చుక వెంట్రుకపై గాంధీ చిత్రం

రాహుల్ గీసిన గాంధీ చిత్రం

అరసవిల్లికి చెందిన చిత్రకారుడు వాడాడ రాహుల్ జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పిచ్చుక వెంట్రుకపై గాంధీజీ ప్రతి రూపాన్ని చిత్రీకరించారు. చిత్రకాడ రాహుల్ ఎప్పటికీ ఎన్నో చారిత్రక ఘట్టాలను, ప్రముఖుల చిత్రాలను నెమలి పించముతోపాటు పక్షి వెంట్రుకలపైన చిత్రీకరించి పలువురు మనల్ని పొందారు. గాంధీజీ 75 వర్ధంతి సందర్భంగా మహాత్మునికి ఈ రూపంలో నివాళ్లర్పిస్తున్నట్లు రాహుల్ తెలిపారు.

\- ప్రజాశక్తి, శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న ఎంపిపి దీప

రూ.73 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- బూర్జ

మండలాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.73 కోట్లతో 23 రకాల పనులను చేపట్టనున్నామని ఎంపిపి కర్నేన దీప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల బడ్జెట్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీల వారీగా 2023-24 సంవత్సరానికి చేపట్టాల్సిన పనులకు సంబంధించి అధికారులతో, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. అనంతరం అధికారులు, ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించి పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఇంకా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు గురించి చర్చించారు. సమావేశంలో ఎంపిడిఒ రవీంద్రబాబు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, డిసిఎంఎస్ మెంబరు జల్లు బలరాంనాయుడు, నాగేశ్వరరావు, ఎఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

నైపుణ్యాభివృద్ధి శిక్షణపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థులకు అందిస్తున్న నైపుణ్యాభివృద్ధిపై అధ్యాపకులు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ అన్నారు. కళాశాలలోని రిసోర్సు సెంటర్‌లో మూడో విడత ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. నోడల్ రిసోర్స్ సెంటర్ జిల్లా కో-ఆర్డినేటర్, లెఫ్టినెంట్ డాక్టర్ వై.పోలినాయుడు, ఇంటర్న్‌షిప్ కో-ఆర్డినేటర్ బి.మోహనరావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.శాంతీదేవిలు పాల్గొన్నారు. ఈ మేరకు 46 మందికి ఇంటర్న్‌షిప్ నమోదు చేశారు. మూడు రోజుల పాటు మాస్టర్ ట్రైనర్ శివకుమార్, బి.మోహనరావు శిక్షణా తరగతులు నిర్వహిస్తారని తెలిపారు.

డయాలసిస్ సేవలు పెంపు

పలాస: పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేసుకుంటున్న కిడ్నీ రోగులకు సువర్ణ అవకాశమని, ప్రతి రోజూ నాలుగు షిఫ్ట్‌లు డయాలసిస్ చేసుకునేందుకు అవకాశం లభించిందని పలాస ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానిశంకర్ తెలిపారు. పలాస ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మూడు షిఫ్ట్‌ల్లో కిడ్నీ రోగులకు డయాలసిస్ చేయడం జరిగిందని, వాటికి అదనంగా మరో షిఫ్టు పెంచడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని కిడ్నీ రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందుకు సహకరించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నవరత్నాలతో ఆర్థిక స్వావలంబన

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో ఆర్థిక స్వావలంబన కలుగుతోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని ఒకటో వార్డు తిమ్మాపురంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో మెగా డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయులను నియమిస్తామని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థల ఏర్పాటుతో ప్రజల వద్దకే ప్రభుత్వం నినాదంతో సుపరిపాలనలో చరిత్ర సృష్టించారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రత్యక్ష నగదు బదిలీ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కె.అప్పలనాయుడు, టి.పి.ఎస్.హెచ్.వి.సత్యనారాయణ, హౌసింగ్, విద్యుత్ ఎఇలు డి.సన్యాసిరావు, జి.రామారావు వైసిపి నాయకులు పొడుగు శ్రీనివాసరావు, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం

లావేరు: సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొత్తకుంకంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మండల ప్రత్యేకాధికారి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మాజీ ఎంపిపి దన్నాన రాజినాయుడు, ఎంపిటిసి దొండపాటి శివ, మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, గొర్లె అప్పలనాయుడు, మీసాల శ్రీనివాసరావు, లంకలపల్లి గోపి, జనపాల భానోజీరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పోస్టర్‌ను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

జలుమూరు: పార్టీలకు అతీతంగా... అర్హతే ప్రామాణికంగా ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని మాకివలసలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి గడపలోనూ సంక్షేమ దివ్వెలు వెలుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే టిడిపి నాయకులు, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, నేడు వైసిపి అధికారంలోకి వచ్చాక ఏ విధమైన సిఫార్సులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, కనుసు సీతారాం, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షుడు పాగోటి రాజప్పలనాయుడు, అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షుడు పొన్నాన ముసలినాయుడు, తంగి మురళీకష్ణ, మొజ్జాడ శ్యామల రావు, పైడి విఠల్‌రావు, లక్ష్మణరావు, అంపోలు తిరుపతిరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: లఖందిడ్డి పంచాయతీలోని అన్ని గ్రామాలకు, కాలనీలకు డ్రైనేజీలు, సిసి రోడ్లు, మంచినీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తానని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లఖందిడ్డి గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత పాలకులు తమ పార్టీకి ఓటు వేయలేదని ఈ పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించలేదని, అందుగే ఈ పంచాయతీ అభివృద్ధికి అమడ దూరంలో ఉందన్నారు. పార్టీలకు అతీతంగా పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, నాగభూషణరావు, బి.నాగేశ్వరరావు, డి.రోజా రామకృష్ణ, సర్పంచ్ బి.గణపతిస్వామి, ఎన్.అప్పలస్వామి, బి.ఎల్లయ్య, బి.సూర్యారావు, కె.సంజీవరావు, లక్ష్మణరావు, పి.దాసు, తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం : గాంధీ వేషధారణలో విద్యార్థి

గాంధీ స్ఫూర్తిని కొనసాగిద్దాం

పోలాకి: గాంధీ స్ఫూర్తిని కొనసాగించాలని సర్పంచ్ మజ్జి రమణమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మినారాయణ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, ఆర్.త్రినాథరావు, సీనియర్ అసిస్టెంట్ దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: సత్యం, అహింసా అనే అయుధాలతో ప్రపంచానికి కొత్తదారి చూపిన గాంధీ మార్గంలో మనమంతా పయనించాలని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.ఫణీంద్రకుమార్ అన్నారు. సోమవారం గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బాపూజీ కలలను సాకారం చేయటానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సంపతిరావు హేమసుందరరాజు, నాయకులు ఎ.రామారావు, సర్పంచులు పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, పట్నాన శ్రీనివాస్, పిట్ట శ్రీనివాసరావు, సింగుపురం వినోద్, నేతింటి సింహాచలం, పంకు రాము, మండల పరిషత్ సూపర్‌వైజర్ ఎస్.రాజేశ్వరమ్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: గాంధీ స్ఫూర్తిని మనమంతా కొనసాగిద్దామని బారువ శాఖా గ్రంథాలయ అధికారి ఎం.ధర్మారావు అన్నారు. సోమవారం గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీచిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.రవి, ఎల్.శ్రీను, కె.వెంకటరావు, పి.నవీన్, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నేటి యువత గాంధీమార్గాన్ని అనుసరించాలని ఐజెయు నల్లి ధర్మారావు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని శాంతినగర్ కాలనీలోని గాంధీ స్మారక మందిరంలో ఐజెయు ఆధ్వర్యాన గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఇస్కఫ్ కార్యదర్శి సనపల నరసింహులు, ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, జాతీయ బిసి సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టా చంద్రపతిరావు, జెడియు రాష్ట్ర కార్యదర్శి కరణం తిరుపతినాయుడు, జిల్లా అధ్యక్షులు ఎం.వి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జి.సిగడాం : మండలంలోని అద్దానంపేటలో ప్రాథమిక పాఠశాలలో గాంధీ వర్ధంతి సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు గాంధీ వేషధారణలో అందరినీ అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, ఉపాధ్యాయులు సీతమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్వనాథం

దళిత బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా దళితులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు అణచివేతకు గురవుతూనే ఉన్నారని, వారికి ఆర్థిక, సామాజిక, రాజకీయాల్లో దమాసా పద్ధతిలో రాజ్యాధికారం వచ్చినప్పుడే న్యాయం జరుగుతుందని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వై.కె.విశ్వనాథం అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ కార్యాలయంలో సోమవారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్యూల్డ్ తరగతుల రిజర్వేషన్ విభజన కోసం సుదీర్ఘ కాలం పాటు పోరాడిన నాయకుడని మంద కృష్ణమాదిగ అని అన్నారు. రాజకీయాల్లో పోరాట స్ఫూర్తిని నింపడం ద్వారా అట్టడుగు వర్గాలకు న్యాయం చేయడానికి పార్టీ తనవంతు కృషి చేస్తుందన్నారు. కార్యరకమంలో రానా శ్రీనివాస్, ఎంఆర్‌పిఎస్ నాయకులు లోపింటి కృష్ణమాదిగ, నారాయణరావు, రామారావు, దాసరి తిరుమల, ఎందవ నారాయణరావు, అలజంగి చిన్నారావు, కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నర్సింగరావు

బడి ఈడు పిల్లలు గుర్తింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

బడిఈడు పిల్లలు చక్కగా చదువుకోవాలని సిఆర్‌పి బొడ్డేపల్లి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని చీమలవలసలో డ్రాప్ అవుట్ సర్వేను సోమవారం చేపట్టామని తెలిపారు. అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్స్ (ఒఎస్‌సి) సర్వేలో 40 మంది డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించామని పేర్కొన్నారు. అలాగే ఇతర గ్రామాల్లోనూ సర్వ శిక్షా అభియాన్ సిబ్బంది ఆధ్వర్యాన సర్వేను చేపడుతున్నామని చెప్పారు. ఈ సర్వే ద్వారా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి గతంలో వారు ఎక్కడ విద్యను అభ్యసించారో తెలుసుకుంటున్నామని అన్నారు. మరలా ఆయా పాఠశాలల్లో చేర్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ కూన వెంకట సత్యనారాయణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎం.రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. స్వామి వారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో వారికి స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, జ్ఞాపికను ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సిటిజన్ ఔట్ రీచ్ సర్వే

ఆమదాలవలస : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు కార్యక్రమం విజయవంతం చేయడంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్‌తో ఇంటింటికి వెళ్లి సిటిజన్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని వేగవంతంచేయాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని చీమలవలసలో సోమవారం నిర్వహిస్తున్న సిటిజన్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆసరా, చేయూత, ఇబిసి కాపు నేస్తం, జగనన్న అమ్మఒడి, నాడు-నేడు, జగనన్నతోడు, సున్నా వడ్డీ తదితర పథకాలను ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. వాలంటీర్ల ద్వారా త్వరితగతిన ఈ కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ ఈ.వి.రమణ, కార్యదర్శి పప్పల రాము, మహిళా సంరక్షణ కార్యదర్శి అంపోలు అమృతకుమారి, సంక్షేమ విద్యా సహాయకులు కూన వెంకట సత్యనారాయణ, ఇంజినీరింగ్ సహాయకులు పేడాడ సుధీర్, హెల్త్ సెక్రటరీ పి.లీలాకుమారి, హరికృష్ణ పాల్గొన్నారు.

జలుమూరు: సిటిజన్ ఔట్ రీచ్ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపిడిఇఒ జి.వి. రవికుమార్ వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని టెక్కలిపాడు, కరవంజ గ్రామాల్లో సోమవారం నిర్వహిస్తున్న సిటిజన్ ఔట్ రీచ్ సర్వేను పరిశీలించారు. ఆయన వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రభుత్వ న్యాయవాదిగా వినయ్ భూషణరావు

వినయ్ భూషణరావు

శ్రీకాకుళం లీగల్ : ప్రభుత్వ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది ఎం.ఎస్.వినయ్ భూషణరావును నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మూడేళ్ల పాటు జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేస్తారు. ఈయన నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

2న వాహనాల వేలం

బూర్జ : స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వచ్చే నెల 2న వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎస్ఐ అశోక్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఇటీవల వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొవాలని సూచించారు. పా టదారులు రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు కట్టి తమ ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు.

'గోరుముద్ద' పరిశీలన

ఆమదాలవలస : జగనన్న గోరు ముద్ద పథకంలో భాగంగా పిల్లలకు సరిపడా పౌష్టికాహారాన్ని అందించాలని మండల విద్యా సంక్షేమ అధికారి పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని కొర్లకోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న జగనన్న గోరు ముద్ద పథకాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం అందిస్తున్న భోజనం నాణ్యత గురించి పిల్లలను అడిగి తెలుసు కొని సంతృప్తి వ్యక్తపరిచారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు తమ్మినేని రాధమ్మ, సువ్వరి వనజాక్షి, ప్రధానోపాధ్యాయులు భైరి అప్పారావు, కంచరాపు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు బాసటగా..

వజ్రపుకొత్తూరు: మండలంలోని చిన అంగవానితోటకు చెందిన సంగారు పార్వతి భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. కూలి పనులు చేసుకుంటూ కుమారుడు విజయ్‌ని చదివిస్తుంది, పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఇంటర్ చదవటానికి ఆర్థిక స్థోమత లేదు. విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు స్పందించి పూండి సాయి వినీత కాలేజీలో చేర్పించి ఫీజు కట్టారు. మొదటి సంవత్సరంలో మంచి మార్కులు తెచ్చుకున్నాడు. రెండో ఏడాది ఫీజు రూ.8500లను సభ్యులు విద్యార్థి తల్లి పార్వతికి సోమవారం అందించి, చదువు కొనసాగించడానికి సహకారం అందించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తిరుపతి, ప్రశాంత్, జోగారావు, శ్రీధర్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మందపల్లిలో ఓపెన్ హౌస్

ఇచ్ఛాపురం: మండలంలోని మందపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గెస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన చైల్డ్‌లైన్ సంస్థ కో-ఆర్డినేటర్ జాస్మిన్ కుమారి పర్యవేక్షణలో బాలికలకు అవగాహన కల్పించారు. ఈచ్ఎం వెంకటరావు అధ్యక్షత బాలలతో స్నేహ పూర్వక వాతావరణం కల్పించాలని అన్నారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించనున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి.శివప్రసాద్, సాజన్, మహేశ్వరి, సీత, ఝాన్సి, తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

కోటబొమ్మాళి: మండలం నారాయణవలస గురువారం సంత నుండి పశువులు అక్రమ రవాణాను నిలిపివేయాలని, అక్రమ రవాణా చేస్తున్న వారిపై పోలీసు కేసులు నమోదు చేయాలని ఎపి గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ అన్నారు. సోమవారం ప్రాంతీయ పశు వైద్య కార్యాలయంలో పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు లోకనాథం అధ్యక్షతన సంతల మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నారాయణవలస సంతలో జిఒ 23, హైకోర్టు ఆదేశాలు మేరకు పశువులకు గడ్డి, దాన, నీడ కోసం షెడ్లు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

మాట్లాడుతున్న క్రాంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘకాలం పాటు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ అధ్యక్షులు మామిడి క్రాంతి కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన మహాసభల తీర్మానాలను సోమవారం విలేకరులతో మాట్లాడి వివరించారు. దేశంలో మూడు దశాబ్దాలుగా సరళీకరణ విధానాలతో కార్మికవర్గం హక్కులు, సౌకర్యాలు, జీత భత్యాలు, ఉద్యోగభద్రత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రంలో మోడీ, షా ప్రభుత్వ నియంతపాలన అంతమొందించాలని పిలుపు నిచ్చారు. దేశంలో కార్మికులకు హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జ్యూట్ పరిశ్రమను జాతీయ పరిశ్రమగా గుర్తించాల న్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. రిమ్స్, సామాజి ఆస్పత్రులు, గురుకులాలు తదితర సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉదోయగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్నం భోజనం స్కీమ్‌వర్కర్లను క్రమబద్ధీకరించాల న్నారు. కొవ్వాడ అణు విద్యుత్కేంద్ర నిర్మాణాన్ని నిలిపివేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు లకు, పెన్షనర్లకు ప్రతినెలా 1న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, దమ్ము సింహాచలం, సవలపురపు కృష్ణవేణి, దువ్వు జయప్రద, సింగూరు బాబూరావు, సనపల అప్పారావు, అన్నెపు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయాల పరిశీలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని ప్రశాంతి నగర్లో ఉన్న విజయభవాని ఆలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్టు ద్వారా సమరత సేవా సంస్థ ఆధ్వర్యాన రూ.పది లక్షలు నిధులను మంజూరు చేశారు. దీనిలో భాగంగా దేవదాయశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చలమలశెట్టి రమణ సోమవారం ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాన్ని పరిశీలించామని, నిధులు విడుదలకు నివేదికను తయారుచేసి దేవదాయశాఖ కమిషనర్‌కు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ ఇంజినీర్ చందన, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ రామరత్న యగ్రీవరావు, సెక్రటరీ బొడ్డేపల్లి రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ తమ్మ సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ పేడాడ రాజేంద్ర, శ్రీరాములు, షణ్ముఖ, చిన్నారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూరు : మండలంలోని హంసకాలనీలో ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయ పనులను దేవాదాయశాఖ అధికారి ఎ.ఇ.టి.చందన, ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావులు పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి రూ.పది లక్షలు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. వీరి వెంట సర్పంచ్ ప్రతినిధి మజ్జి వెంకటరావు, మాజీ సర్పంచ్‌లు పొగిరి మోహనరావు, కొమరాపు వెంకటరావు, ఆలయ కమిటీ సభ్యులు బి.నీలకంఠరావు, పి.గోవింద్, బి.వెంకటరావు, బి.రామారావు, కె.లక్ష్మీనారాయణ, కె.రవి, పి.ఆదినారాయణ ఉన్నారు.

నేటి నుంచి నిద్దాలమ్మ తల్లి యాత్ర

జి.సిగడాం : మండలంలోని నిద్దాంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిద్దాలమ్మ యాత్ర నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రకు జి.సిగడాం, రాజాం, పొందూరు, సంతకవిటి మండలాల నుంచి యాత్రికులు తరలివస్తారని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు పలు వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎస్ఐ సిహెచ్.రామారావు ఆధ్వర్యాన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

బీమా చెక్కు అందజేత

టెక్కలి: మండలంలోని బొప్పాయిపురం సచివాలయం పరిధిలోని చల్లపేట గ్రామానికి చెందిన తర్రా లక్ష్మణరావు ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి సోమవారం అందించారు.

నియామక పత్రాలు అందజేత

జలుమూరు: ఎంపిడిఒ కార్యాలయం వద్ద కరకవలస, చిన్నదూగం పంచాయతీల్లో నూతనంగా నియమించిన వాలంటీర్లకు నియామక పత్రాలను ఎమ్మెల్యే కృష్ణదాస్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి గోపి, ఎంపిడిఒ రవికుమార్, వైసిపి నాయకులు సీతారాం, మురళీకృష్ణ, జి.నేతాజీ, కె.హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సమస్యలపై వినతి

ఇచ్ఛాపురం: ఖాతాదారుల సమస్యలపై సంబంధిత బ్యాంకు మేనేజర్లకు ఎలియన్స్ క్లబ్ సభ్యులు సోమవారం ఎస్‌బిఐ, యుబిఐ, ఇండియన్ బ్యాంక్ మేనేజర్లను కలిసి వినతి పత్రాలు అందించారు. ఈ మధ్య కాలంలో బ్యాంకుల్లో వినియోగదారుల ప్రమేయం లేకుండా వారి ఖాతా నుంచి డబ్బులు విత్‌డ్రా అవ్వడం, చాలామంది వినియోగదారులు డబ్బులు పోగొట్టుకుంటున్నారని, వారికి ఆ డబ్బులు వచ్చే విధంగా ప్రయత్నించాలని కోరారు. దీనికి బ్యాంకు మేనేజర్లు నగదు రికవరికీ ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఎలియన్స్ క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి, పిఆర్‌ఒ దక్కత గోపీనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఉమా శంకర్, ఉప కార్యదర్శి ఎల్ వెంకటరావు, రమణప్రకాష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

జలుమూరు: మండలంలోని చిన్నదూగాంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 42 మందికి వైద్యసేవలు అందించినట్లు జలుమూరు పిహెచ్‌సి వైద్యాధికారి తాడేల శ్రీకాంత్ తెలిపారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలు పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తాగునీటి బావులను ఆరోగ్య సిబ్బంది క్లోరినేషన్ చేయించారు. హెల్త్ సూపర్‌వైజర్ చిన్న రాజులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి: మండల కేంద్రంలోని బెహరా వీధిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర మత్స్య వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా నాయకత్వంలో, జెమ్స్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, నాయకులు రొక్కళ భాస్కర్, డి.దివాకర్, బడగల రామకృష్ణ, బడే రాజు, మోహన్, రాజు బెహరా, గిరి బెహరా, త్రినాథ్ బెహరా, జగన్నాథ్ బెహరా, అరుణ్, భరత్, శివ, ఉమా, మురళి బెహరా, ధనుంజయ్ బెహరా, దుదిష్టి బెహరా, త్రినాథ్ బెహరా, వార్డ్ మెంబర్ గౌతమ్, మాదవ బెహరా తదితరులు పాల్గొన్నారు.



పొందూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పొందూరు : పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలోని ఎరుకలపేట సమీపంలో భద్రమహంకాళీ ఆలయం ఆవరణంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ప్రవీణ్ నాయుడు, శ్రీదేవి, రాజు, చంద్రశేఖర్‌లు ఎరుకలపేట, సాయిబుల కాలనీ, కుమ్మరి కాలనీ, తాపీమేస్త్రి కాలనీ, జోగన్నపేటకు చెందిన 78 మందికి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు కాళ్లకూరి శాంతారాం, కుమిలి రాజేష్, టిడిపి అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహన్ పాల్గొన్నారు.

యువకులకు కిట్‌ను అందజేస్తున్న సభ్యులు

క్రీడా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని శేఖరాపురం యూత్ సభ్యులకు సోమవారం ఎంజిఆర్ యువసేన ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో మరింత రాణించాలని అన్నారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, పైల కూర్మారావు, రామస్వామి, తాడేల షణ్ముఖ, యువజన సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదాయ అభివృద్ధి పనులపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గ్రామ సంఘాల్లో ప్రతి సంఘం సభ్యులు ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ అభివద్ధి కార్యక్రమాలైన ఫుడ్ ప్రాసెసింగ్, పాడి పశువుల పెంపకం, చిన్న వ్యాపారాలు ఏర్పాటుపై అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు అన్నారు. సోమవారం మహిళా సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సంధర్భంగా మాట్లాడుతూ పుస్తక నిర్వహణ, రుణాలు పొందటం, తిరిగి చెల్లించడం, ప్రతి సంఘం క్రమం తప్పక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలి అన్నారు. పారదర్శకతతో, సభ్యులందరూ భాగస్వామ్య పద్ధతిలో కార్యక్రమాలు చేసుకుని అన్ని సంఘాలు ఏ గ్రేడ్ లో ఉండే విధంగా, ప్రభుత్వ పథకాలైన జగనన్న తోడు మండల లక్షం మేరకు చిన్న వ్యాపారులకు రూ.10 వేలు రుణం, వైఎస్ఆర్ ఆసరా, చేయూత లబ్ధిదారులకు వారి వ్యాపారాలు, వృత్తులు, వారి ఆధార్‌తో యాప్‌లో అప్‌డేట్ గురించి అవగాహన కల్పించారు. సిబ్బంది చేస్తున్న ప్రతి కార్యక్రమాలు సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, ఎంపిపికు సమాచారం అందించాలి అన్నారు. వారి ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేసి అందరితో సమన్వయం చేసుకొని పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిసి మోహనరావు పాల్గొన్నారు.

పలువురి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్ల గ్రామానికి చెందిన పాలక జయరాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబం రోడ్డున పడింది. జయరాం స్నేమితులు, బ్రాహ్మణతర్ల హెల్పింగ్ వారియర్స్ టీం చందాలు వేసుకొని రూ.51,200 ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కర్ర నందేశ్వరరావు, లోకనాథం, వేణుగోపాల్, బాబురావు, సారా కుమార్, వూన హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని అక్కురాడ గ్రామానికి చెందిన మున్నెజేటి మోహన్‌రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన స్నేహితులు అందరూ చందాలు వేసుకొని సేకరించిన రూ.50 వేలను మృతుని భార్య కృష్ణవేణికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రావు, కుటుంబ సభ్యులు, కుమార్తె నందిని, కుమారుడు రామ్‌చరణ్, తండ్రి అప్పారావు, స్నేహితులు పాల్గొన్నారు.